ఆస్తి కోసమే ఆరుగురి హత్య

- నలుగురు కలిసి కుటుంబాన్ని కడతేర్చారు
- పాతిక లక్షల ఇంటి కోసం ప్రాణాలు తీసిన ప్రశాంత్
- నిందితుడికి సహకరించిన తల్లి, తమ్ముడు
- మరో ఇద్దరి సాయం తీసుకున్న కిరాతకుడు
- ప్రసాద్ తల్లిని చంపే క్రమంలో పట్టుబడ్డ నిందితులు
- మాక్లూర్ కుటుంబం హత్య కేసును ఛేదించిన పోలీసులు
- వివరాలు వెల్లడించిన కామారెడ్డి ఎస్పీ సింధూశర్మ

నిందితులను మీడియా ముందు ప్రవేశపెట్టి, కేసు వివరాలు వెల్లడిస్తున్న కామారెడ్డి ఎస్పీ సింధూ శర్మ

నిజామాబాద్, డిసెంబర్ 19 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఆరు వరుస హత్యల కేసులో కామారెడ్డి పోలీసులు నిందితులను అరెస్టు చేశారు. ఆస్తి కోసమే ఈ దారుణానికి పాల్పడినట్లు తేల్చారు. నిజామాబాద్ జిల్లా మాక్లూర్ గ్రామానికి చెందిన మేడిద ప్రశాంత్, ఆయన తల్లి వడ్డెమ్మ, మైనర్ అయిన తమ్ముడు, దాస్‌నగర్ గ్రామానికి చెందిన బానోతు విష్ణు, బానోతు వంశీలను అరెస్టు చేసినట్లు కామారెడ్డి ఎస్పీ సింధూశర్మ తెలిపారు. కామారెడ్డిలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నలుగురు నిందితులను మీడియా ఎదుట ప్రవేశపెట్టారు. ఆర్థిక లావాదేవీల విషయంలో తలెత్తిన వివాదాలతో పాటు ప్రసాద్ ఆస్తిపై కన్నేసిన ప్రశాంత్ ఈ దారుణాలకు ఒడిగట్టినట్లు తెలిపారు. నవంబర్ 29న తొలి హత్య చేసిన నిందితులు డిసెంబర్ 13న ఆరో హత్య చేసినట్లుగా ఎస్పీ పేర్కొన్నారు. ప్రసాద్ తల్లి సుశీలను సైతం చంపేందుకు ప్రయత్నిస్తున్న క్రమంలో వీరు పోలీసులకు పట్టుబడ్డారని ఆమె చెప్పారు. డిసెంబర్ 14న వెలుగు చూసిన హత్య కేసును ఛేదిస్తున్న క్రమంలో నిందితుల జాడను పాల్వంచ వద్ద గుర్తించి అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. హత్యకు గురైన ఆరుగురిలో నలుగురి మృతదేహాలు లభ్యమయ్యాయని, ప్రసాద్ మృతదేహన్ని మాక్లూర్ మండలం మదన్‌పల్లి అటవీ ప్రాంతంలో గుర్తించినట్లు వెల్లడించారు. ప్రసాద్ భార్యను చంపి బాసర వద్ద గోదావరిలో పడేశారని ఎస్పీ చెప్పారు. హత్యకు సంబంధించిన మరిన్ని వివరాలు సింధూశర్మ మాటల్లో..

ఆరు హత్యల్లో మైనర్ బాలుడు..

మాక్లూర్‌కు చెందిన పూనే ప్రసాద్ (36) 2018లో అదే గ్రామానికి చెందిన ఒక అమ్మాయిని మోసం చేయగా, ఆమె ఆత్మహత్య చేసుకుంది. దీంతో ప్రసాద్‌పై సెక్షన్ 354డి, ఐపీసీ 306 సెక్షన్ల కింద కేసులు నమోదయ్యాయి. అప్పటికే అతడు దుబాయ్ వెళ్లగా, ఈ కేసు పెండింగ్ ఉంది. 2022 అక్టోబర్‌లో స్వగ్రామానికి వచ్చిన ప్రసాద్‌ను పోలీసులు అరెస్టు చేసి, జైలుకు పంపించగా బెయిల్‌పై బయటకు వచ్చారు. దుబాయ్‌లో ఉన్నప్పుడే మేడిద ప్రశాంత్‌కు.. ప్రసాద్ రూ.3.5లక్షలు అప్పు ఇచ్చాడు. జైలు నుంచి తిరిగొచ్చాక ప్రసాద్ కుటుంబానికి మాక్లూర్‌లో నివసించే పరిస్థితులు లేకపోవడంతో కామారెడ్డి జిల్లా పాల్వంచకు మకాం మార్చారు. ఈ క్రమంలో భారీగా అప్పులు కావడంతో తానిచ్చిన డబ్బులను తిరిగి చెల్లించాలంటూ ప్రశాంత్(25)పై ప్రసాద్ ఒత్తిడి తెచ్చాడు. మరోవైపు, మాక్లూర్‌లో రూ.25లక్షలు విలువ చేసే రెండు ఇళ్లు, ఒక జాగను కుదువ పెట్టే ప్రయత్నం చేయగా సఫలీకృతం కాలేదు. ఈ క్రమంలోనే ప్రశాంత్‌ను సంప్రదించగా తన పేరిట ఆస్తులను రిజిస్ట్రేషన్ చేసిస్తే లోన్ ఇప్పిస్తానని చెప్పడంతో అది నమ్మిన ప్రసాద్ రిజిస్ట్రేషన్ చేయించాడు. తీసుకున్న అప్పు, ఇళ్లు పేరిట ఇస్తానన్న లోన్ సంగతి ఏమిటని ప్రశ్నించగా ప్రశాంత్ తప్పించుకుని తిరగడం మొదలు పెట్టాడు. మాక్లూర్ వదిలి వేరే చోట నివాసం ఉంటున్న ప్రసాద్‌ను, ఆయన కుటుంబీకులను చంపేస్తే ఆస్తులు తనకే చెందుతాయని ప్రశాంత్ భావించాడు. ఈ క్రమంలోనే మాక్లూర్ శివారులోని దాస్‌నగర్ తండాకు చెందిన బానోతు విష్ణు(19), బానోతు వంశీ(19)లతో రూ.60వేలకు ఒప్పందం చేసుకుని ఆరుగురిని హత్య చేశాడు. వీరితో పాటు ప్రశాంత్ తమ్ముడు (మైనర్) సైతం చేతులు కలిపాడు.

నవంబర్ 29న తొలి హత్య..

నవంబర్ 29న మాక్లూర్‌కు వచ్చిన ప్రసాద్ నేరుగా ప్రశాంత్ ఇంటికెళ్లి ఎలాగైనా తన డబ్బులిచ్చేయాలని ఒత్తిడి చేశాడు. ఇదే అదనుగా భావించిన ప్రశాంత్.. బానోతు విష్ణు, వంశీలతో సంప్రదింపులు జరిపాడు. నిజామాబాద్‌లో ఓ వ్యక్తి వద్ద కారును కిరాయికి తీసుకుని వచ్చి మద్యం సేవిద్దామంటూ ప్రసాద్‌తో కలిసి మాక్లూర్ మండలం మదన్‌పల్లి గ్రామ శివారులోని అటవీ ప్రాంతానికి తీసుకెళ్లారు. మద్యం మత్తులోకి జారుకున్న ప్రసాద్ తలపై కట్టెలు, రాళ్లతో మోది చంపేసి అక్కడే చెట్ల పొదల్లో పడేశారు. అర్ధరాత్రి మాక్లూర్‌కు వచ్చి పార, గడ్డపారలను తీసుకుని వచ్చి అడవిలోనే ప్రసాద్ మృతదేహాన్ని పూడ్చేశారు. ప్రసాద్ కనిపించడం లేదని కుటుంబీకులు ఎవరైనా పోలీసులను సంప్రదిస్తారని భావించి డిసెంబర్ 1న పాల్వంచ గ్రామానికి ప్రశాంత్ ఒక్కడే వెళ్లాడు. గతంలో యువతి ఆత్మహత్య కేసు విషయంపై ప్రసాద్ కోసం పోలీసులు తిరుగుతున్నారని ఆయన భార్య శాన్విక(29), చెల్లెలు శ్రావణి(23)లను భయపెట్టి నిజామాబాద్‌కు తీసుకొచ్చాడు. భర్త దగ్గరికి పోదామని చెప్పి శాన్వికను బాసర బ్రిడ్జి వైపు తీసుకెళ్లి విష్ణు, వంశీలతో కలిసి గొంతు నులిమి చంపేసి గోదావరి నదిలో పడేశారు. అన్నా వదినల దగ్గరికి వెళ్దామని మాయమాటలు చెప్పి శ్రావణిని కారులో ఎక్కించుకుని మెదక్ జిల్లా చేగుంట మండలం వడియారం శివారులో 44వ జాతీయ రహదారి పక్కన గొంతు బిగించి చంపేసి పెట్రోల్ పోసి తగులబెట్టారు.

నిజామాబాద్ లాడ్జీలో పెట్టి..

ప్రసాద్ తల్లి సుశీల, అతని పిల్లలు చైత్రిక(8), చైత్రిక్(8), ఇంకో చెల్లెలు స్వప్న(26)ను భయభ్రాంతులకు గురి చేసి నిజామాబాద్ రైల్వే స్టేషన్ సమీపంలో గల అన్నపూర్ణ లాడ్జిలో ఉంచారు. వీరికి తోడుగా ప్రశాంత్ తన తల్లి వడ్డమ్మను వీరితో పాటే ఉంచాడు. ప్రసాద్ తన పిల్లలను చూడాలని అంటున్నారని చెప్పి లాడ్జిలో ఉన్న చైత్రిక, చైత్రిక్‌లను డిసెంబర్ 4న తన తమ్ముడు(మైనర్)ను వెంటేసుకుని తీసుకెళ్లాడు. కారులో సోన్ బ్రిడ్జి వైపు వెళ్లిన నిందితులు గొంతు నులిమి పిల్లలను చంపి వంతెన కింద కాలువలో పడేశారు. భార్య, పిల్లలతో ప్రసాద్ ఒకే చోట క్షేమంగా ఉన్నారని ప్రసాద్ తల్లి సుశీల, మరో సోదరి స్వప్న (దివ్యాంగురాలు)కు నమ్మబలికారు. డిసెంబర్ 13న స్వప్నను కారులో ఎక్కించుకుని గాంధారి ఎక్స్ రోడ్డు సమీపంలోని భూంపల్లి శివారులో గొంతుకు తాడు బిగించి చంపేసి పెట్రోల్ పోసి కాల్చి వేశారు. లాడ్జిలో అందరినీ పోగొట్టుకుని మిగిలిన ప్రసాద్ తల్లి సుశీలను సైతం హత్య చేయాలని భావించిన సమయంలో ఆమె తప్పించుకుంది. డిసెంబర్ 14న వెలుగు చూసిన గుర్తు తెలియని యువతి హత్య కేసును ఛేదిస్తున్న క్రమంలో ఈ దారుణం వెలుగులోకి వచ్చింది. శాస్త్రీయ, సాంకేతిక ఆధారాలతో నిందితులు మేడిద ప్రశాంత్, బానోతు విష్ణు, బానోతు వంశీ, మరో మైనర్ బాలుడ్ని పాల్వంచ వద్ద పోలీసులు పట్టుకుని వివరాలు ఆరా తీయగా ఆరు హత్యల విషయం బయటపడిందని ఎస్పీ సింధూ శర్మ వివరించారు. ఈ హత్యల్లో పాలు పంచుకున్న ప్రశాంత్ తల్లి వడ్డెమ్మ(60)ను సైతం పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. నిందితుల నుంచి కారు, బైక్, భూమి రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లు, రూ.30 వేల నగదు, 5 సెల్‌ఫోన్లు, తాడు, 2 పెట్రోల్ బాటిళ్లు, బంగారు పుస్తెల తాడును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్పీ చెప్పారు. ఈ కేసు దర్యాప్తులో కీలకంగా వ్యవహరించిన సీఐ రామన్, ఎస్సై రాజు, కానిస్టేబుళ్లు అశోక్, జానకిరామ్, రవికుమార్, అబ్దుల్ హమీద్, శశికాంత్, నరేష్, సుధాకర్ రెడ్డి, హోంగార్డు అరుణ్‌లను ఎస్పీ అభినందించారు.

ప్రశాంత్ ఇంటి ముట్టడికి యత్నం

మాక్లూర్, డిసెంబర్ 19: ఆస్తి కోసం ఒకే కుటుంబానికి చెందిన ఆరుగురిని కిరాతకంగా హతమార్చిన నిందితుడు ప్రశాంత్ ఇంటిని ముట్టడించేందుకు మాక్లూర్ గ్రామస్తులు మంగళవారం యత్నించారు. స్థానిక సర్పంచ్ అశోక్‌రావును ఘెరావ్ చేశారు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని స్థానికులను అడ్డుకున్నారు. దీంతో గ్రామంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి.

ఒకే రోజు 75 వేల మంది ప్రయాణం

శంషాబాద్ ఎయిర్‌పోర్టు సరికొత్త రికార్డు

హైదరాబాద్ సిటీబ్యూరో, డిసెంబర్ 19 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్ నుంచి విమానాల్లో దేశ, విదేశాలకు వెళ్లే ప్రయాణికుల సంఖ్య ఏటేటా గణనీయంగా పెరుగుతున్నది. దీంతో శంషాబాద్‌లోని రాజీవ్‌గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం (ఆర్‌జీఐఏ) సరికొత్త రికార్డు సృష్టించింది. ఈ విమానాశ్రయం నుంచి గత నెల 25న ఒక రోజు 75 వేల మంది దేశ, విదేశాలకు ప్రయాణించడంతో ఈ రికార్డు నమోదైనట్టు అధికారులు వెల్లడించారు. నవంబర్ నెలలో ఆర్‌జీఐఏ నుంచి మొత్తం 14,462 విమానాల రాకపోకలు జరిగాయని, వీటిలో 20,32,250 మంది ప్రయాణించారని వివరించారు. నిరుడు ఇదే కాలంతో పోల్చితే ప్రయాణికుల సంఖ్య 17% పెరిగినట్టు తెలిపారు. ఈ ఏడాది నవంబర్ వరకు ఆర్‌జీఐఏ నుంచి 1.63 కోట్ల మంది ప్రయాణించారని, ఈ సంఖ్య 2022–23 కంటే 22 శాతం ఎక్కువని పేర్కొన్నారు. ఈ ఏడాది నవంబర్‌లో ఒమన్ ఎయిర్ సంస్థ సరుకు రవాణా విమాన సేవలను ప్రారంభించడంతోపాటు దేశీయ, అంతర్జాతీయ మార్గాలను విస్తరించింది. మరోవైపు ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ సహకారంతో ఆర్‌జీఐఏ నుంచి కొత్త సేవలను మొదలుపెట్టారు. దీంతో గత నెల 14న లండన్‌లో జరిగిన ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టు సమ్మిట్‌లో ఆర్‌జీఐఏకి 'సస్టెయినబుల్ ఎయిర్‌పోర్టు అవార్డు– స్ట్రాటజీ, కల్చర్ అండ్ ఎథోస్' విభాగంలో ప్రశంసలు దక్కినట్టు అధికారులు తెలిపారు.

జూనియర్ డాక్టర్ల సమ్మె విరమణ

- ప్రతి నెలా 15లోగా స్టయిఫండ్ చెల్లింపులకు ప్రభుత్వం జీవో
- మంత్రి దామోదర రాజనర్సింహతో చర్చలు సఫలం

హైదరాబాద్, డిసెంబర్ 19 (నమస్తే తెలంగాణ): స్టయిఫండ్ తదితర సమస్యలపై మంగళవారం నుంచి నిర్వహించతలపెట్టిన సమ్మెను విరమిస్తున్నట్టు జూనియర్ డాక్టర్లు ప్రకటించారు. వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఇచ్చిన హామీ మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్టు వెల్లడించారు. జూనియర్ డాక్టర్ల సమ్మె నేపథ్యంలో మంత్రి రాజనర్సింహ మంగళవారం సచివాలయంలోని తన చాంబర్‌లో తెలంగాణ జూనియర్ డాక్టర్స్ అసోసియేషన్(జూడా), తెలంగాణ సీనియర్ రెసిడెంట్స్ అసోసియేషన్ (ఎస్ఆర్డీఏ) ప్రతినిధులతో సమావేశమయ్యారు. అనంతరం జూనియర్ డాక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కౌశిక్‌కుమార్ మాట్లాడుతూ.. ఇకపై తమకు ప్రతి నెల 15వ తేదీలోగా స్టయిఫండ్ చెల్లిస్తామని, పెండింగ్ స్టయిఫండ్‌ను విడుదల చేస్తామని మంత్రి హామీ ఇచ్చారని తెలిపారు. ఉస్మానియా జనరల్ దవాఖానకు కొత్త భవనం నిర్మాణానికి రెండు నెలల్లో శంకుస్థాపన చేస్తామని హామీ ఇచ్చారని వెల్లడించారు. ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లోని హాస్టల్స్ గదులు సరిపోవడం లేదని వివరించగా మంత్రి సానుకూలంగా స్పందించారని పేర్కొన్నారు. ప్రైవేట్ కాలేజీల్లో చదువుతున్న పీజీ విద్యార్థులకు కూడా స్టయిఫండ్ ఇవ్వాలన్న ఎన్ఎంసీ నిబంధనలను యాజమాన్యాలు పట్టించుకోవడం లేదని మంత్రి దృష్టికి తీసుకెళ్లినట్టు చెప్పారు. విదేశాల్లో మెడిసిన్ చదివి ఇక్కడ ఇంటర్న్‌షిప్ చేస్తున్న విద్యార్థులకు సైతం తమతో సమానంగా స్టయిఫండ్ చెల్లించే అంశంపై సమీక్షిస్తానని మంత్రి హామీ ఇచ్చారని తెలిపారు.

వేడెక్కిన ఏపీ రాజకీయాలు

హైదరాబాద్, డిసెంబర్ 19 (నమస్తే తెలంగాణ): ఆంధ్రప్రదేశ్‌లో రాజకీయాలు వేడెక్కాయి. వచ్చే ఏడాది ఫిబ్రవరిలో జరుగనున్న అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికల్లో అన్ని సీట్లు కైవసం చేసుకోవడమే లక్ష్యంగా ప్రణాళికలు సిద్ధం చేస్తున్న వైసీపీ అధినేత, సీఎం జగన్మోహన్‌రెడ్డి.. తమ అభ్యర్థుల జాబితా రూపొందించేందుకు కసరత్తు చేస్తున్నారు. ప్రస్తుతం ఉన్న ఎమ్మెల్యేల్లో మెజార్టీ అభ్యర్థులను మార్చాలని నిర్ణయించారు. అందులో భాగంగా ఇప్పటికే 11 నియోజకవర్గాల్లో ఇంచార్జీలను మార్చిన జగన్.. వచ్చే ఎన్నికల్లో వారికి టికెట్లు ఇస్తున్నట్టు ప్రకటించారు. తాజాగా మంగళవారం మరికొందరు మంత్రులు, ప్రజాప్రతినిధులకు సీఎం జగన్ నుంచి పిలుపు వచ్చింది. దీంతో మంత్రులు విశ్వరూప్, గుమ్మనూరు జయరాంతోపాటు రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాద్, పీ గన్నవరం ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు, గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి తదితరులు తాడేపల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయానికి వెళ్లి జగన్‌తో భేటీ అయ్యారు.

దక్షిణ మధ్య రైల్వే

ద.మ. రైల్వే యొక్క టెండరు ప్రకటనల వివరాలను మా వెబ్‌సైట్ www.scr.indianrailways.gov.in పై చూడవచ్చును.

బహిరంగ వేలం

కాజీపేట్ హంప్ యార్డ్ వద్ద కుప్పగా గల క్లెయిమ్ చేయని బొగ్గు సుమారు బరువు 110 టన్నులు భారత రాష్ట్రపతి తరపున కాజీపేట్ హంప్ యార్డ్ వద్ద 28 డిసెంబర్ 2023న 10.00 గంటలకు బహిరంగ వేలం ద్వారా విక్రయించబడుతుంది.

సవివరమైన వేలం ప్రకటన కొరకు మా వెబ్‌సైట్: www.scr.indianrailways.gov.in లో "tenders" దర్శించండి.

సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్, సికింద్రాబాద్

భారత ప్రభుత్వం

ఆర్కియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా

హైదరాబాద్ సర్కిల్, హైదరాబాద్

O/o సూపరింటెండింగ్ ఆర్కియోలజిస్ట్, ఆర్కియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా, హైదరాబాద్ సర్కిల్, కేంద్రీయ సదన్, 2వ బ్లాక్, 3వ అంతస్తు, సుల్తాన్ బజార్, కోఠి, హైదరాబాద్–500001 (TS), ఫోన్: నం. 040–24658124, 040–24651012

ఇ–టెండర్లు కోరుతూ ప్రకటన

దిగువ పనుల కొరకు CPWD/రాష్ట్ర ప్రభుత్వ PWD/రైల్వేస్/MES/ASIతో నమోదైన కంపెనీ/సంస్థ/ఏజెన్సీ/కాంట్రాక్టర్ నుండి సూపరింటెండింగ్ ఆర్కియోలజిస్ట్, ఆర్కియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా, హైదరాబాద్ సర్కిల్, హైదరాబాద్ వారు భారత రాష్ట్రపతి తరపున ఆన్‌లైన్ విధానంలో "ఓపెన్ ఇ–టెండర్లు" కోరుచున్నారు.

క్ర. సం.	పని పేరు	అంచనా మొత్తం	బయానా మొత్తం	బిడ్ దాఖలుకు చివరి తేది
1	MW (SR) హన్మకొండ వద్ద వేయి స్తంభాల గుడి వద్ద కళ్యాణ మండపం యొక్క మిగిలిన పని పునరుద్ధరణ 2020–21 పని నిర్వహణ. టెండర్ ఐడి: 2023_ASI_785267_1	రూ. [illegible]	రూ. [illegible]	02.01.2024, 11:00 గం.
2	MW (SR) హన్మకొండ, వేయి స్తంభాల గుడి వద్ద ఉడెన్ ర్యాంప్ ఏర్పాటు మరియు త్రాగునీటి ప్రాంతం స్థాయి పెంపుదల–పని నిర్వహణ. టెండర్ ఐడి: 2023_ASI_785402_1	రూ. 4,25,909/-	రూ. 10,618/-	03.01.2024, 11:00 గం.
3	హైదరాబాద్, గోల్కొండ కోటలో పాత్‌వేస్‌కు మరమ్మతులు మరియు బాలహిస్సార్ ఏరియా లోపల పాత్‌వేస్‌కు పాత్‌వే లైట్స్ ఏర్పాటు(క్లాపింగ్ పోర్టికో నుండి 1వ బావి, క్లాపింగ్ పోర్టికో నుండి తారామతి మసీదు) –పని నిర్వహణ. టెండర్ ఐడి: 2023_ASI_785506_1	రూ. [illegible]	రూ. [illegible]	03.01.2024, 11:00 గం.
4	గోల్కొండ కోటలో బాలహిస్సార్ ఏరియా లోపల పాత్‌వేస్‌కు మరమ్మతులు మరియు పాత్‌వేస్‌కు LED పాత్‌వే లైట్స్ ఏర్పాటు–పని నిర్వహణ. టెండర్ ఐడి: 2023_ASI_785532_1	రూ. [illegible]	రూ. [illegible]	03.01.2024, 11:00 గం.
5	MW (SR) వరంగల్, వరంగల్ కోట, స్వయంభు దేవాలయ కాంప్లెక్స్‌లో అమెనిటీస్ బిల్డింగ్ వద్ద ఉడెన్ ర్యాంప్ ఏర్పాటు–పని నిర్వహణ. టెండర్ ఐడి: 2023_ASI_785738_1	రూ. [illegible]	రూ. [illegible]	04.01.2024, 11:00 గం.

టెండర్ యొక్క మరింత సమాచారం/సవివరమైన సమాచారం కొరకు https://eprocure.gov.in/eprocure/app మరియు www.asi.nic.inను దర్శించండి. పై ప్రకటనకు ఏదేని సవరణ/అనుబంధం జారీ చేయబడినచో అది https://eprocure.gov.in/eprocure/appలో మాత్రమే ప్రచురించబడును.

సం/– సూపరింటెండింగ్ ఆర్కియోలజిస్ట్, ASI, హైదరాబాద్ సర్కిల్

బిగ్‌బాస్ ఫ్యాన్స్‌పై విధ్వంసం కేసు

- వీడియోల ఆధారంగా నిందితుల గుర్తింపు
- 10 ప్రత్యేక బృందాలతో పోలీసుల దర్యాప్తు
- కేసులో ఇద్దరు నిందితుల అరెస్ట్
- ప్రధాన నిందితుడు పల్లవి ప్రశాంత్ కోసం గాలింపు

నిందితుడు సాయి కిరణ్

నిందితుడు అంకిరావుపల్లి రాజు

బంజారాహిల్స్, డిసెంబర్ 19: రియాలిటీ షో బిగ్‌బాస్ ఫైనల్స్ అనంతరం జూబ్లీహిల్స్ అన్నపూర్ణ స్టూడియోస్ వద్ద అభిమానులు విధ్వంసం సృష్టించిన కేసులో పోలీసుల దర్యాప్తు వేగం పుంజుకున్నది. ఆదివారం జరిగిన బిగ్‌బాస్ ఫైనల్స్ అనంతరం బయటకు వచ్చిన పోటీదారుల వాహనాలను అభిమానులు ధ్వంసం చేయడంతోపాటు రోడ్డు మీద వెళ్తున్న ఆర్టీసీ బస్సులపైనా ప్రతాపం చూసి ధ్వంసం చేశారు. ఈ ఘటనలో బిగ్‌బాస్ విజేత పల్లవి ప్రశాంత్‌తో పాటు పలువురు వ్యక్తులపై ఇప్పటికే కేసులు నమోదయ్యాయి. పోలీసులు, బిగ్‌బాస్ షో నిర్వాహకుల హెచ్చరికలు బేఖాతరు చేస్తూ పల్లవి ప్రశాంత్ అన్నపూర్ణ స్టూడియోస్ వద్దకు తిరిగి రావడంతో ఆయన అభిమానులు రెచ్చిపోయి పోలీసుల వాహనాలు ధ్వంసం చేసినట్టు దర్యాప్తులో తేలింది. రాళ్లదాడి జరుగుతుండడంతో అక్కడినుంచి వెళ్లిపోవాలని వెస్ట్‌జోన్ డీసీపీ జోయల్ డేవిస్ సహా పలువురు అధికారులు కోరినా ప్రశాంత్ అక్కడినుంచి కారును ముందుకు తీయకపోవడంతో పరిస్థితి అదుపుతప్పిందని తేలింది. ఈ వ్యవహారంలో రెండు నాన్ బెయిలబుల్ కేసులు నమోదు చేసిన జూబ్లీహిల్స్ పోలీసులు సంఘటనకు సంబంధించిన వీడియోల ద్వారా ఇతర నిందితులను గుర్తించే పనిలో పడ్డారు. పల్లవి ప్రశాంత్‌కు మద్దతుగా సోషల్ మీడియా క్యాంపెయిన్ రన్ చేసిన వ్యక్తులతోపాటు పెద్దసంఖ్యలో ఫ్యాన్స్‌ను అక్కడకు పిలిపించిన వారు ఎవరనే అంశంపైనా ఆరా తీస్తున్నారు. నగరం నడిబొడ్డున జరిగిన విధ్వంసాన్ని సీరియస్‌గా తీసుకున్న పోలీసులు 10 ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి నిందితులను పట్టుకునే ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ కేసులో పల్లవి ప్రశాంత్‌ను ఏ–1 నిందితుడిగా చేర్చగా అతడితో పాటే ఉండి ఫ్యాన్స్‌ను రెచ్చగొట్టిన అతడి సోదరుడు మనోహర్‌ను ఏ–2గా, వారి స్నేహితుడు వినయ్‌ను ఏ–3గా చేర్చారు.

ఇద్దరు నిందితుల అరెస్ట్

అన్నపూర్ణ స్టూడియోస్ వద్ద జరిగిన విధ్వంసానికి సంబంధించిన కేసులో ఇద్దరు నిందితులను జూబ్లీహిల్స్ పోలీసులు మంగళవారం సాయంత్రం అరెస్ట్ చేశారు. పోలీసుల సూచనలు బేఖాతరు చేస్తూ పల్లవి ప్రశాంత్‌ను ఓపెన్ టాప్ కారులో చిత్రపురి కాలనీ నుంచి అన్నపూర్ణ స్టూడియోస్ వద్దకు తిరిగి తీసుకువచ్చిన ఏ–4 నిందితుడు శంతని సాయికిరణ్(25), ఏ–5 నిందితుడు అంకిరావుపల్లి రాజు(23)ను అరెస్ట్ చేసిన పోలీసులు వారి వాహనాలు స్వాధీనం చేసుకున్నారు. కేసులో ప్రధాన నిందితుడైన పల్లవి ప్రశాంత్ కోసం గాలింపు ప్రారంభించారు. బిగ్‌బాస్ విజేతగా నిలిచిన తర్వాత సొంతూరు కొల్గూరుకు వెళ్లిన ప్రశాంత్‌ను అదుపులోకి తీసుకునేందుకు ప్రత్యేక బృందాలు వెళ్లినట్టు సమాచారం. ఫోన్ స్విచ్ఛాఫ్ చేసుకున్న ప్రశాంత్ అక్కడినుంచి వేరే ప్రాంతానికి వెళ్లినట్టు తెలిసింది. బిగ్‌బాస్ కంటెస్టెంట్లు అమర్‌దీప్, గీతూ రాయల్ తదితరుల కార్లను ధ్వంసం చేసిన వారిని గుర్తించేందుకు సీసీ ఫుటేజీలను, వీడియోలను పోలీసులు జల్లెడ పడుతున్నారు.

పంచాయతీ ఫర్నిచర్‌కు నిప్పు

- డబుల్ బెడ్రూం ఇల్లు మంజూరు చేయాలని గొడవ
- సర్పంచ్‌పై యువకుడి దాడి

భిక్కనూరు, డిసెంబర్ 19: డబుల్ బెడ్రూం ఇల్లు మంజూరు చేయాలని గొడవకు దిగిన ఓ యువకుడు సర్పంచ్‌పై దాడి చేశాడు. అంతేకాకుండా పంచాయతీ కార్యాలయంలోని ఫర్నిచర్‌ను దహనం చేశాడు. ఈ ఘటనపై పోలీసులు వివరాలు వెల్లడించారు. కామారెడ్డి జిల్లా భిక్కనూరు మండలం సిద్ధరామేశ్వరనగర్‌కు చెందిన గంధం రంజిత్ తనకు డబుల్ బెడ్రూం ఇల్లు మంజూరు చేయాలని సర్పంచ్ జనగామ శ్రీనివాస్‌తో మంగళవారం గొడవకు దిగాడు. ఈ విషయమై సర్పంచ్‌ను నానా దుర్భాషలాడాడు. రంజిత్ తల్లి పేరిట వారం రోజుల్లో ఇల్లు మంజూరు చేస్తామని, ఈ విషయమై ఉన్నతాధికారులను అడిగి తెలుసుకుంటానని సర్పంచ్ చెప్తున్నా వినిపించుకోలేదు. కోపోద్రిక్తుడైన రంజిత్ పంచాయతీ కార్యాలయంలోని ఫర్నిచర్‌పై పెట్రోల్ పోసి తగులబెట్టాడు. సర్పంచ్ శ్రీనివాస్, వీడీసీ అధ్యక్షుడు బోనాల శ్రీనివాస్ ప్రభుత్వ ఆస్తులను దహనం చేయొద్దని వారించారు. అయినప్పటికీ రంజిత్ సర్పంచ్‌పై కూడా పెట్రోల్ పోశాడు. ఈ విషయమై సర్పంచ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేశారు. రంజిత్ పోలీసుల అదుపులో ఉన్నట్టు ఎస్సై సాయికుమార్ తెలిపారు.

ఆటో బోల్తా.. ఇద్దరు మహిళల మృతి

రోడ్డుపై కోతిని తప్పించే క్రమంలో ప్రమాదం

వేములవాడ రూరల్, డిసెంబర్ 19: కోతిని తప్పించబోయి ఆటో బోల్తా పడిన ఘటనలో ఇద్దరు మహిళలు మృతి చెందారు. ఈ ఘటన మంగళవారం రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ రూరల్ మండలం పోచెట్టిపల్లి శివారులో చోటుచేసుకున్నది. వేములవాడ మండలం చింతల్‌ఠాణాకు చెందిన 10 మంది చందుర్తి మండలం మర్రిగడ్డలో వరినాట్లు వేసేందుకు ఉదయం ఆటోలో వెళ్లారు. తిరిగి సాయంత్రం వచ్చే క్రమంలో పోచెట్టిపల్లి వద్ద కోతి రోడ్డుకు అడ్డుగా రావడంతో దానిని తప్పించే క్రమంలో ఆటో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో జాతర గొండ మల్లవ్వ (55), బాలవ్వ(58) మృతి చెందారు. మరో ఐదుగురికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు ఆటో డ్రైవర్‌పై కేసు నమోదు చేశారు.

6 రాష్ట్రాలకు 0.5% అదనపు రుణం

- 15వ ఆర్థిక సంఘం సిఫార్సులతో కేంద్రం నిర్ణయం
- విద్యుత్తు సంస్కరణల అమలుకు నజరానా
- ఏపీ, అస్సాం, కేరళ, రాజస్థాన్, సిక్కిం, బెంగాల్‌కు అవకాశం

హైదరాబాద్, డిసెంబర్ 19 (నమస్తే తెలంగాణ): విద్యుత్తు రంగంలో సంస్కరణలు అమలు చేసినందుకు అర శాతం (0.5) రుణాలను అదనంగా పొందేందుకు కేంద్రం వెసులుబాటు కల్పిస్తూ నిర్ణయం తీసుకున్నది. ఈ మేరకు కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ అధికారికంగా ఎక్స్‌లో (ట్విట్టర్) పోస్ట్ చేసింది. 15వ ఆర్థిక సంఘం, కేంద్ర విద్యుత్తు మంత్రిత్వ శాఖ సిఫార్సులతో మార్కెట్ నుంచి అదనపు రుణాలు పొందేందుకు అనుమతిస్తున్నట్టు వెల్లడించింది. 2022–23కు సంబంధించి అదనపు రుణం తీసుకొనేందుకు ఆంధ్రప్రదేశ్, అస్సాం, కేరళ, రాజస్థాన్, సిక్కిం, పశ్చిమబెంగాల్‌కు అవకాశం కల్పించింది. ఈ రాష్ట్రాలు మొత్తంగా రూ.27,238 కోట్లు రుణంగా తీసుకొన్నాయి. విద్యుత్తు సంస్కరణల్లో భాగంగా మూడేండ్లపాటు అదనపు రుణాన్ని అమలు చేయాలని నిర్ణయించగా, 2021–22లో 12 రాష్ట్రాలు రూ.39,175 కోట్ల రుణాన్ని తీసుకున్నాయి. 2023–24లో రూ.1,43,332 కోట్లు తీసుకొనే అవకాశం ఉన్నది. 2021–22లో ఆంధ్రప్రదేశ్ రూ.3,716 కోట్ల అదనపు రుణం పొందగా, 2022–23లో రూ.5,858 కోట్లు పొందే అవకాశం దక్కింది.

సంస్కరణల్లో దూకుడుగా కేంద్రం

కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం విద్యుత్తు సంస్కరణల విషయంలో దూకుడుగా ముందుకు వెళ్తున్నది. దీనిలో భాగంగా కేంద్రం సూచనలతో పలు రాష్ట్రాలు వ్యవసాయ మోటర్లకు మీటర్లు కూడా పెట్టాయి. అలాగే డిస్కంలను ప్రైవేటీకరించడానికి సిద్ధమయ్యాయి. కేంద్రం నుంచి వచ్చే సూచనలకు అనుగుణంగా క్షేత్రస్థాయిలో చర్యలు తీసుకుంటున్నాయి. ఈ నేపథ్యంలోనే విద్యుత్తు రంగంలో సంస్కరణలను అమలు చేసిందుకు అదనంగా 0.5 శాతం రుణాలు పొందేందుకు 2022–23 కోసం ఆరు రాష్ట్రాలకు కేంద్రం అవకాశం కల్పించింది.

గురుకుల టీచర్ల సమస్యలు పరిష్కరించండి

హైదరాబాద్, డిసెంబర్ 19 (నమస్తే తెలంగాణ): గురుకుల టీచర్లు, అధ్యాపకుల సమస్యల పరిష్కరించాలని ప్రోగ్రెసివ్ రికగ్నైజ్డ్ గురుకుల టీచర్స్ అసోసియేషన్ (పీఆర్‌జీటీఏ) నేతలు కోరారు. మంగళవారం మైనార్టీ గురుకులాల కార్యదర్శి షఫీయుల్లాను కలిసి వివిధ అంశాలపై వారు చర్చించారు. ఇటీవలే ఆవిర్భవించిన సంఘం విధివిధానాలు, ఉద్దేశాలను ఆయనకు వివరించారు. జాయింట్ సెక్రటరీ లియాకత్ హుస్సేన్, డిప్యూటీ సెక్రటరీ దిలావర్‌ను సైతం అసోసియేషన్ నేతలు మర్యాదపూర్వకంగా కలిశారు. కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర ప్రతినిధులు ఉప్పు అశోక్, ఈ శ్రీనివాసాచారి, ఐ నిర్మలానందం, కే రామకృష్ణారెడ్డి, మైనార్టీ గురుకులాల రాష్ట్ర కన్వీనర్ పానుగంటి విజయ్‌కుమార్, కో కన్వీనర్ లక్ష్మారెడ్డి, రంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రక్త సంబంధానికి నెత్తుటి మరకలు

- పైసలే పరమావధి.. బంధాలకు సమాధి
- ఆస్తుల కోసం అయినవాళ్లనే కడతేర్చుతున్న వైనం
- హత్యలకు దారితీస్తున్న.. వివాహేతర సంబంధాలు
- రాష్ట్రంలో ఈ ఏడాది కుటుంబ కలహాలతో 176 హత్యలు

'మాయమైపోతున్నడమ్మా.. మనిషన్నవాడు.. మచ్చుకైనా లేడు చూడు.. మానవత్వం ఉన్నవాడు..' అన్నట్టు పేగుబంధాలకు నిలువెల్లా సమాధికడుతున్నది నేటి సమాజం. రక్తసంబంధాలు వెన్నపోట్లు పొడుస్తుంటే.. స్నేహబంధాలు కడుపులో కత్తులు దించుతున్నాయి. వివాహేతర సంబంధాలు.. గుట్టుచప్పుడు కాకుండా గొంతునులిమేస్తున్నాయి. ఎక్కడచూసినా పైసలే పరమావధిగా రక్తసంబంధాలు సైతం.. ఆర్థిక సంబంధాలుగా మారుతున్నాయి. మానవత్వాన్ని విడిచి అన్నదమ్ములను, అక్కాచెల్లెళ్లను, జన్మనిచ్చిన తల్లిదండ్రులను, ఆఖరికి ప్రాణంగా చూసుకునే స్నేహితులను, నమ్మివచ్చిన ప్రియురాళ్లను సైతం అంతమొందించేందుకు వెనుకాడటం లేదు. దేశవ్యాప్తంగా నమోదవుతున్న హత్యల్లో ఆస్తివివాదాలు, వివాహేతర సంబంధాలదే అగ్రస్థానం.

హైదరాబాద్, డిసెంబర్ 19 (నమస్తే తెలంగాణ) : కేవలం 20 లక్షల రూపాయల విలువ చేసే రెండు చిన్న ఇండ్లు.. రూ.3 లక్షల అప్పు ఆరుగురి ప్రాణాలను బలిగొన్నది. ఆస్తి కోసమే ముక్కుపచ్చలారని ఇద్దరు చిన్నారులు, వారిద్దరి మేనత్తలు, ఆ పిల్లల తల్లిదండ్రులు.. మొత్తంగా ఆరుగురిని అంతమొందించాడు కిరాతకుడైన ఓ స్నేహితుడు. నిజామాబాద్ జిల్లాలో వెలుగు చూసిన ఈ దారుణ ఘటన తెలుగు రాష్ట్రాల్లో సంచలనం సృష్టించింది. ఇలాంటి ఉదాంతాలు దేశవ్యాప్తంగా నిత్యం వెలుగుచూస్తూనే ఉన్నాయి. ఎక్కడ చూసినా అయినవాళ్లే.. తమ వాళ్లను అతి కిరాతకంగా చంపేస్తున్నారు. భూ వివాదాలు, ఆస్తిగొడవలతో రక్త సంబంధాలు రక్తసిక్తమవుతున్నాయి. 2022లో నమోదైన మర్డర్ కేసుల్లో అయినవాళ్ల పాత్రే అధికంగా ఉందని నేషనల్ క్రైమ్స్ రికార్డ్స్ బ్యూరో (ఎన్సీఆర్బీ) వెల్లడించింది. తుచ్ఛమైన ఆస్తుల కోసం మానవ సంబంధాలను మంటగల్పుతున్నారని, డబ్బుల కోసం కిరాతకంగా చంపేస్తున్నారని, మనుషుల్లో ఈ తరహా విపరీత ధోరణి బాగా పెరిగిపోయిందని సైకాలజిస్టులు సైతం ఆందోళన చెందుతున్నారు.

పదివేల హత్యలు.. వివాదాలవే!

ఎన్సీఆర్బీ రిపోర్ట్ ప్రకారం.. 2022లో దేశ వ్యాప్తంగా 28,522 హత్య కేసులు నమోదయ్యాయి. వీటిల్లో 9,662 హత్యలు పలు వివాదాల కారణంగా జరిగాయి. వీటిల్లో 3,761 హత్యలు వ్యక్తిగత కక్షల వల్లే జరిగాయంటే అతిశయోక్తి కాదు. మన తెలంగాణలో 2022లో వివిధ వివాదాల వల్ల 516 హత్యలు నమోదయ్యాయి. దేశవ్యాప్తంగా భూవివాదాల కారణంగా 2,326 హత్యలు నమోదు కాగా.. తెలంగాణలో 98 హత్యలు జరిగాయి. కేవలం కుటుంబ తగాదాలు, గెట్టు పంచాయితీలు, అన్నదమ్ములు, అక్కాచెల్లెళ్ల మధ్య ఆస్తి గొడవల కారణంగా దేశవ్యాప్తంగా 3,134 హత్యలు నమోదు కాగా.. తెలంగాణలో 258 నమోదయ్యాయి. కొద్దిపాటి గొడవలు చిలికి చిలికి 3,294 హత్యలకు దారితీశాయి. ఈ తరహా హత్యలు తెలంగాణలో 134 నమోదయ్యాయి.

హత్యలకు దారితీస్తున్న 'లవ్ ఎఫైర్స్'

ప్రేమ, స్నేహం ముసుగులో అయితనవారే గొంతులుకోస్తున్నారు. 2022లో ప్రేమ వ్యవహారాల కారణంగా దేశవ్యాప్తంగా 1,401 హత్యలు జరిగితే.. తెలంగాణలో కేవలం 14 హత్యలు మాత్రమే నమోదయ్యాయి. ఇక వివాహేతర సంబంధాల కారణంగా 2022లో 1,420 హత్యలు నమోదు కాగా.. తెలంగాణలో 116 హత్యలు జరిగాయి. మొత్తంగా 2020లో 29,193 హత్యలు, 2021లో 29,272 హత్యలు, 2022లో 28,522 హత్యలు జరిగాయి. కాగా మన తెలంగాణలో 2020లో 802 హత్యలు, 2021లో 1026 హత్యలు, 2022లో 937 హత్యకేసులు నమోదయ్యాయి. అయితే, 2023 నవంబర్ 30 నాటికి మొత్తం 789 హత్య కేసులు నమోదైనట్టు సమాచారం. కాగా వీటిల్లో అత్యధికంగా కుటుంబ కలహాల వల్ల 176 హత్యలు నమోదైనట్టు సమాచారం.